# హక్కుల్ని నిలుపుకునే కృషికి ఆహ్వానం


## మిర్యాలగూడెం

### తూడి ఫంక్షన్ హాల్‌లో

మే నెల 7, 8 తేదీలలో

## మానవహక్కుల వేదిక

### మొదటి రాష్ట్ర మహాసభలు



---

వక్తలు : **డా॥ సురేశ్** (పి.యు.సి.ఎల్, తమిళనాడు)
సునామీ-మానవహక్కులు

**జి.అలోషియస్** (పరిశోధకుడు, ఢిల్లీ)
అభివృద్ధి విధానాలు - మానవహక్కులు

**సి.కె.జాను** (ఆదివాసీ హక్కుల కార్యకర్త, కేరళ)
ఆదివాసులు - అభివృద్ధి

**కమల్ మిత్ర చినాయ్** (పాకిస్తాన్-ఇండియా ప్రజావేదిక)
భారత పాక్ సంబంధాలు - ప్రజాతంత్ర దృక్పథం

ప్రజలారా!

మానవహక్కుల వేదిక మొదటి రాష్ట్ర మహాసభలకు ఆహ్వానం పలుకుతున్నాం, మీ సహాయ సహకారాలు కోరుతున్నాం.

హక్కుల గురించిన స్పృహ, హక్కులు కావాలన్న ఆరాటం ఇవాళ సమాజంలో చాలా పెరిగాయి. తమకంటూ హక్కులుంటాయన్న ఆలోచన నిన్నటిదాకా లేనివారు కూడా ఈరోజు ఆ ఆలోచన చేస్తున్నారు, అడుక్కోవడం కాక దబాయించి ఇమ్మంటున్నారు.

హక్కుల స్పృహ పెరిగేకొద్దీ హక్కులను అమలు చేయవలసిన యంత్రాంగాలూ, వ్యవస్థలూ తమ కర్తవ్యాన్ని మరింత చురుకుగా నిర్వహిస్తాయని ఆశిస్తాం. కాని సరిగ్గా అందుకు భిన్నంగా, అవి మరింత కఠినంగా, నిర్లక్ష్యంగా, నిర్దయగా తయారవుతున్నాయి. న్యాయస్థానాలలో సహితం హక్కుల పరిభాషకు చోటు తగ్గిపోతున్నది. హక్కులడిగే వారిని అనుమానంగా చూసే వైఖరి పెరుగుతున్నది.



ఒకరు హక్కులు అడుగుతున్నారంటే వేరొకరు కొంత అధికారాన్నో కొంత సంపదనో అయాచితంగా వచ్చిన కొన్ని అవకాశాలనో కోల్పోతారని అర్థం. వారిలో అసహనమూ ఈ రోజు పెరిగింది. ఫలితంగా హక్కులు అడిగే ప్రజలపైన వారు గుంపులుకట్టి దాడిచేస్తున్నారు, భ్రష్టుపట్టించే దుష్ప్రచారం చేస్తున్నారు, అధికార యంత్రాంగాన్ని అడ్డంపెట్టుకొని నిర్బంధం ప్రయోగిస్తున్నారు.

ఒకవైపు హక్కుల కోసం కొత్త కొత్త పోరాటాలు ముందుకు రావడం చూస్తున్నాం. సమాజం మూలల నుండి హక్కులడిగే గొంతులను వింటున్నాం. మేమెవ్వరినీ అడుక్కోవడం లేదు, మనుషులుగా మాకు చెందవలసిందే అడుగుతున్నాం అన్న కోణాన్ని తెలుసుకుంటున్నాం.

ఈ గొంతులు చట్టాలలో సవరణలు కోరుతున్నాయి. ప్రభుత్వ విధానాలలో మార్పుకోసం అడుగుతున్నాయి. పత్రికలలోనూ, దృశ్య మీడియాలోనూ తమకు చోటు ఇవ్వాలని డిమాండ్ చేసి పొందుతున్నాయి. సమాజంలోని ఇతర వర్గాలు, ముఖ్యంగా తమ లేమినుండి, తమ అణగారినతనం నుండి ప్రయోజనం పొందుతున్న వర్గాలు, తమ కోర్కెలను సావధానంగా వినాలనీ, న్యాయబద్ధంగా స్పందించాలనీ, లేనిపక్షంలో ప్రతిఘటనకు సిద్ధంగా ఉండాలనీ అంటున్నాయి.

మరొకవైపు పాలకుల సంకట స్థితి, రెండు నాల్కల నీతి చూస్తున్నాం. మాటల వరకు ఎవరినీ దేనినీ కాదనగల స్థితిలో వారు లేరు. ఎవ్వరికీ ఏదీ ఇచ్చే ఉద్దేశ్యంలోనూ లేరు. కాబట్టి అస్పష్టమైన హామీలిచ్చి తాము చేసేది చేసుకుంటూ గట్టిగా అడ్డుతగిలితే పోలీసులను పెట్టి కొట్టిస్తూ సాగించుకుంటున్నారు.

ఆధిపత్యాన్నీ, అవకాశాలనూ అనుభవిస్తున్న వర్గాలు మరింత పచ్చిగా అసహనం ప్రదర్శిస్తున్నారు. వారి ఆధిపత్యం ఓట్ల ద్వారా వచ్చేది కాదు కాబట్టి అనునయంగా మాట్లాడవలసిన అవసరం తమకు లేదని వారి ఆలోచన. దూషణ, దాడులు, పోలీసులను మేపి అణచివేత ప్రయోగించడం వారి వ్యవహారనీతి అయింది.

ప్రపంచ వ్యాప్తంగా పెత్తనం చలాయిస్తున్న 'సరళీకరణ' తత్వం, భారత సమాజం మీద పట్టుబిగిస్తున్న హిందుత్వ వాదం ఏక సమయంలో ఈ అసహనానికీ, అణచివేత ధోరణికీ కారణమూ, పర్యవసానమూ.

ఈ స్థితిలో హక్కుల ఉద్యమానికి ఒక విశాలమైన కర్తవ్యం ఉందనీ, తనకు తానొక చిన్న పరిధి గీసుకొని అందులో ఉండి పోవడం తగదనీ ప్రకటించి పుట్టింది మానవహక్కుల వేదిక ఏడేళ్ల కింద. ఈ ఏడు సంవత్సరాల కాలంలో దాదాపు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోనూ హక్కుల పరిరక్షణ కోసం కార్యక్రమాలు చేపడుతూ మా మొదటి మహాసభలను మే నెల 7, 8 తేదీలలో మిర్యాలగూడెంలో జరుపుకుంటున్నాము. మేము ఏయే రంగాలలో హక్కుల గొంతును నిలబెట్టడానికి ఏమేం కృషి చేశామో క్లుప్తంగా వివరించి మా మహాసభలకు మీ మద్దతు, సహాయ సహకారాలు కోరుతాము.

మన రాష్ట్రానికి ఈ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 'పేరుతెచ్చిన' విషయాలలో ప్రముఖమైనది రైతుల ఆత్మహత్యలు. కర్ణాటక, పంజాబు మనతో పోటీపడే ప్రయత్నం కొంత చేస్తున్నప్పటికీ ప్రథమ స్థానం ఆంధ్రప్రదేశ్‌దే. తన ప్రాణం తాను తీసుకోవడానికి ఒక వ్యక్తి నిర్ణయించుకుంటే అందులో హక్కుల సమస్య ఏముంది అనుకోవచ్చు. కానీ ఆ నిర్ణయం వెనుక వ్యవస్థాగతమైన కారణాలున్నాయి. చిన్న కమతాలు ఎక్కువగా ఉండే మనబోటి దేశాలలో మార్కెట్ ఆటుపోట్లనూ, ప్రకృతి వైపరీత్యాలనూ, దశాబ్దాలుగా సాగుతున్న నీటివనరుల నిర్వహణా వైఫల్యాన్నీ, ముడిసరుకుల కల్తీనీ ఎదుర్కొనడానికి రైతులకు పాలనా యంత్రాంగం అండగా నిలబడాలనీ, ఇది రైతుల హక్కనీ మేము భావిస్తున్నాం. ఆర్థిక సరళీకరణ పేరుతో కష్టం చేసుకుని బతికే వారి జీవితాన్ని మరింత కష్టతరం చేస్తున్న ప్రభుత్వ విధానాలు ఈ ఆత్మహత్యల వెనక ఉన్నాయని మేము అర్థం చేసుకుంటున్నాం. ఆత్మహత్యల ఘటనలను నిర్దిష్టంగా పరిశీలించి ఈ వాస్తవాన్ని సమాజం ముందు నిలబెట్టడానికి కృషిచేస్తున్నాం. దీనికి విరుగుడుగా ప్రభుత్వం చేపట్టిన చర్యల అసంపూర్ణతను ఎండగడుతున్నాం.

అయితే 'వ్యవసాయ సంక్షోభం' కేవలం వ్యవసాయదారులనే కాదు, చేతి వృత్తుల వారినీ, గ్రామీణ కూలిజనాన్నీ కూడా కుదిపేస్తున్నది. రైతులు ఆత్మహత్య చేసుకుంటే, భూమిలేని కూలీలు దూర ప్రాంతాలకు వలసపోయి దిక్కులేని బతుకులు బతుకుతున్నారు, బతకలేకపోతే చస్తున్నారు. వేరే ఏ వృత్తికీ అలవాటు పడలేని నేతకార్మికులు ఆకలికి కృశించి ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిని కేవలం అభివృద్ధి ఆటుపోట్లుగా చూడాలంటుంది ప్రభుత్వం. కాదు, నిండుగా జీవించే హక్కుకు సంబం

ధించిన సమస్యగా చూడాలంటున్నాము మేము. నిరంతర పోషకాహార లోపం వల్ల కృశించి, శక్తిహీనులయి ప్రాణం పోగొట్టుకోవ డాన్ని ఆకలిచావు నిర్వచించాలని డిమాండ్ చేస్తున్నాము. దానికి నివారణ, పరిహారం కూడా ఉండాలని అడుగుతున్నాం.

సాగునీటి గురించి కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో జరుగుతున్న ఘర్షణను 'ప్రాంతాల మధ్య' కొట్లాటగానో, రాజకీయ వాదుల రెచ్చగొట్టే చర్యలగానో కాక హక్కులకు సంబంధించిన విషయంగా చూడాలంటున్నాం. జీవితావసరాలలో ఒకటయిన నీరు ప్రకృతి సిద్ధమయిన వనరు. దానిమీద అందరికీ సమాన హక్కు ఉండాలని అంటున్నాం. సాగునీటి వివాదాలను ఆ కోణం నుండి చూస్తున్నాం, నదీ జలాల అసమాన పంపిణీని ఆ కారణంగా వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వం నదీ జలాల ప్రాజెక్టులు చేపట్టే పద్ధతిని ప్రధానంగా ఈ కోణం నుండి చూడాలి తప్ప 'టెండర్ల కుంభకోణా'న్ని ప్రధాన విషయం చేయడంలో అర్థం లేదం టున్నాం.


ఇవి ప్రభుత్వ విధానాలతో, బాహ్యశక్తులు పెట్టే ఒత్తిడితో ముడిపడి ఉన్న విషయాలు కాగా, ఎప్పటినుంచో వస్తున్న అణచివేత కులానికీ జెండర్‌కూ సంబంధించినది. ఈ విషయంలో పెద్ద పెద్ద ఆందోళనలెంత అవసరమో దైనందిన ప్రాతిపదికన బాధితు లకు సలహా, సహాయం, 'అండ అంత అవసరం. అణిచివేతను ఎదుర్కొనడానికి, బెదిరింపులు తట్టుకొనడానికి, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి, పోలీసులు సక్రమంగా నేర పరిశోధన చేసేటట్టు చూడడానికి, 'రాజీపడ'మని ఒత్తిడి పెడితే ధిక్కరించ డానికి, తోడు కావాలి. ఆ తోడు ఇవ్వడం హక్కుల ఉద్యమం ముఖ్య కర్తవ్యాలలో ఒకటి. అది నిత్యం అందిస్తున్నాం.

ప్రపంచీకరణ అనేది మనకు సంబంధించినంతవరకు దేశ పాలనా విధానాలను అప్రజాస్వామికంగా, అమానవీయంగా దిగజార్చే ప్రక్రియ కాగా, అంతర్జాతీయంగా అది అమెరికా ఏకచ్ఛత్ర ఆధిపత్యాన్ని నెలకొల్పడానికొక ముసుగు అయింది. దీని దుష్ఫలితాన్ని అతి ఘోరంగా అనుభవించిన ఆఫ్ఘన్, ఇరాక్ ప్రజలకు సంఘీభావంగా కార్యక్రమాలు చేపట్టాము. అమెరికా విదేశాంగ నీతివెనక ఉన్న దౌర్జన్య రాజకీయాలను వివరిస్తూ విస్తృతంగా ప్రచారం జరిపాం.

నక్సలైట్ ఉద్యమంపైన పోలీసు దమనకాండను వ్యతిరేకించడంతో మన రాష్ట్రంలో హక్కుల ఉద్యమం ప్రారంభం అయింది. ఆ దమనకాండ ఇవ్వాల్టికీ కొనసాగుతున్నది. అయితే ఒక్క నక్సలైట్ల మీదనే కాదు, మొత్తంగానే అన్ని ఉద్యమాలపైనా ఆందోళనల పైనా ఏ ఆందోళనలో భాగం కాకున్నా ఏదో ఒక నేరారోపణతో పోలీసుల అదుపులోకి పోయిన ప్రతీ అర్భకుని పైన బలప్రయోగా నికి పాల్పడడం మన రాష్ట్రంలో పోలీసుల వ్యవహార సంస్కృతి అయింది. దీనికి చట్టమూ, రాజ్యాంగమూ, అవి గుర్తించే పౌర హక్కులూ, మనిషయినందుకు ప్రతీ ఒక్కరూ గౌరవించవలసిన మానవతా – ఏదీ అడ్డంరాదు. ఈ అధికార దమనకాండకు వ్యతిరేకంగా మాట్లాడడం హక్కుల ఉద్యమం నిత్యం చేయవలసిన పని, చేస్తున్న పని.

నక్సలైట్ ఉద్యమాన్ని కేవలం ఒక నేర ప్రక్రియగా చూడొద్దనీ, సామాజిక భూమిక గల రాజకీయ ఉద్యమంగా చూసి రాజకీ యంగా వ్యవహరించమనీ పాలకులకు చెప్తున్నాం. పాలకులు అవునవునంటూనే దానిని శాంతి భద్రతల సమస్యగా చూస్తూ మరింతగా దమనకాండ పెంచుతున్నారు. నక్సలైట్లకు కూడా, ప్రతిఘటన పేరిట ఎంత హింస చేసినా ఎవరిమీద చేసినా అది సమర్థనీయమేనని వాదించవద్దని వారిస్తున్నాం. ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ హింసా ప్రతిహింసల వలయం దుష్ప్ర భావం నుండి రాష్ట్రాన్ని బయటపడేయడం కోసం ఇరుపక్షాలూ చర్చలకు కూర్చోవాలని కోరాం. చర్చల ప్రక్రియను ఫలవంతం చేయడానికి కృషి చేశాం. అది విఫలమైన తరువాత దానిని పునరుద్ధరించడానికి కృషిచేస్తున్నాం.

ఆహార వస్త్రాలతో సమానమయిన అవసరంగా నివాస హక్కును గుర్తించాలని కోరుతున్నాం. మనదేశంలో నివాస హక్కు అనేది ఏ అర్థంలోనూ లేకపోవడం భారత రాజ్యాంగంలోనూ, చట్టాలలోనూ ఉండే లజ్జాకరమైన లోపాలలో ఒకటి. ప్రభుత్వ భూములు పెట్టుబడి పెట్టగల వారికే దత్తం చేయడం ఒక విధానంగా మారిన ప్రస్తుత దశలో గుడిసెలు మూకుమ్మడిగా కూల్చివేయడం మునిసిపాలిటీలకు నిత్యకృత్యం అయింది. ఈ అన్యాయాన్ని మొత్తంగా ఆపలేక పోయినా ఒక్కొక్కచోట కొంతకాలం వాయిదా వేయించడం, ఒక్కొక్కచోట పునరావాసం పొంద డం గుడిసెవాసులకు సాధ్యం అవుతున్నది. ఈ పోరాటాలలో భాగస్వాములమవుతున్నాము.



ఇంకా–

ఏజెన్సీలోనూ రిజర్వ్ ఫారెస్టులోనూ భూమి హక్కుల కోసం ఆదివాసులు చేస్తున్న ఆందోళన లకు, సముద్రం మీదనే కాక తీరం మీద కూడా హక్కు కోసం మత్స్యకారులు చేస్తున్న ఆందోళన

7వ తేదీ పొద్దున్న
10.00 గంటలకు జరిగే
ప్రారంభ సమావేశానికీ
8వ తేదీ
10.00 నుంచి 4.00 గంటల వరకు
జరిగే సెమినార్‌కూ
4.00 నుండి 5.00 దాకా
జరిగే ఊరేగింపుకూ
6.00 నుండి 9.00 దాకా
మిర్యాలగూడెం క్లబ్‌లో
జరిగే బహిరంగ సభకూ

## అందరికీ ఆహ్వానం

## ఆహ్వాన సంఘం

సి.డి.రవికుమార్
(మాజీ జిల్లాపరిషత్ చైర్మన్)
డా॥ ముప్వ రామారావు
(జన విజ్ఞాన వేదిక)
అనుముల నరసింహారెడ్డి
(స్వాతంత్ర్య సమరయోధులు)
గరగోజు భిక్షపతి
(స్వాతంత్ర్య సమరయోధులు)
కె.యామినీదేవి (అడ్వకేట్)
జి.ఉదయకుమారి (టీచర్)
చాపల కిషన్ (రిటైర్డ్ టీచర్)
గుర్రం రామకృష్ణారెడ్డి (అడ్వకేట్)
మహమ్మద్ జబ్బార్ (అడ్వకేట్)
ఎం.జ్యోతి-(సాహసి స్త్రీజన హృదయవేదిక)
కె.క్రిష్టఫర్ (రిటైర్డ్ ఉద్యోగి)
వేనేపల్లి పాండురంగారావు (సర్పంచ్, ఆలగడప)

**హక్కుల ఉద్యమానికి ఒక విశాలమైన కర్తవ్యం ఉందనీ, తనకు తానొక చిన్న పరిధి గీసుకొని అందులో ఉండిపోవడం తగదనీ ప్రకటించి పుట్టింది మానవహక్కుల వేదిక ఏడేళ్ల కింద. ఈ ఏడు సంవత్సరాల కాలంలో దాదాపు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోనూ హక్కుల పరిరక్షణ కోసం కార్యక్రమాలు చేపడుతూ మా మొదటి మహాసభలను మే నెల 7, 8 తేదీలలో మిర్యాలగూడెంలో జరుపుకుంటున్నాము.**

లకు, సమాన అవకాశాల కోసం వికలాంగులు చేస్తున్న ఆందోళనలకు, సమాన అవకాశాల కోసమే కాక సగౌరవంగా బతికే అవకాశం కోసం మైనారిటీలు చేస్తున్న ఆందోళనలకు, తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే స్వేచ్ఛ కోసం దేశ సరిహద్దు ప్రాంతాల ప్రజలు చేస్తున్న ఆందోళనలకు, భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట అమలవుతున్న ప్రాంతీయ పెత్తనం నుండి విముక్తి కోరుకుంటున్న తెలంగాణ వంటి వివక్షకు గురయిన ప్రజలు చేస్తున్న ఆందోళనలకు, కళ్ల ముందే హరించుకుపోతున్న చట్టపరమైన హక్కులను రక్షించుకోవడం కోసం కార్మికులు చేస్తున్న ఆందోళనలకు, మొత్తం ప్రభుత్వ రంగం స్థానాన్ని ఆక్రమించుకున్న ప్రైవేట్ ఉత్పత్తి, వాణిజ్య రంగాలలో దళితులకూ ఆదివాసులకూ స్త్రీలకూ సకల బల హీన వర్గాలకూ ప్రభుత్వరంగం నమూనా లోనే రిజర్వేషన్లు కల్పించాలన్న ఆందోళనకు, ప్రపంచ బ్యాంకు ఏం చెప్పినా నయా ఉదారవాద సిద్ధాంత పైత్యం ఏమన్నా విద్య, వైద్యం మొదలైన సకల కనీస జీవిత అవసరాల కల్పన ప్రభుత్వం బాధ్యతగానే ఉండాలన్న ఆందోళనలకు-

అండగా ఉంటున్నాం. మద్దతు ఇస్తున్నాం, అవి లేవదీసిన విలువలను సామాజిక ఆలోచనా రీతులలో పెంపొందించే కృషి చేస్తున్నాం, పాలనలో వ్యవస్థితం చేసే కృషీ చేస్తున్నాం.

ఈ కృషి కొనసాగాలనీ, ఇంకా బాగా జరగాలనీ కోరుకునే వారి సహాయ సహకారాలు కాంక్షిస్తూ-

**25 ఏప్రిల్ 2005** **మానవహక్కుల వేదిక**

Human Rights Forum (HRF)